(హాస్య నాటిక)

# ప్రేమయాత్ర

—జీడిగుంట రామచంద్రమూర్తి

(తెర లేచేసరికి...అదొక హోటల్ గది. ఎడమ వైపు డబుల్ కాట్. దాని పక్కనే టేబులు. దాని మీద కూజా, గాజు గ్లాసులు. కుడి వైపున డ్రస్సింగు టేబులు. ఒక పక్కన రెండు కుర్చీలు. వాటి ముందు టీపాయ్. ఎటాచ్డ్ బాత్‌రూం. ఒక చేత్తో బాగ్ పట్టుకుని శంకరం ప్రవేశించాడు. వెనకాలే సుందరికూడా వచ్చింది. ఇద్దరూ బాగా అలిసి పోయినట్లుగా కనిపిస్తున్నారు. హోటల్ బోయ్ బ్రీఫ్‌కేసు తీసుకొచ్చి ఒక పక్కన పెట్టాడు. మంచం మీద బెడ్‌షీటు పరుస్తున్నాడు )

శంకరం: ( బాగ్ టీపాయ్ మీద పెట్టి ) చూడు, బాబూ! ముందు మాకు రెండు కాఫీలు అర్జంటుగా పట్రావాలి.

సర్వర్: అలాగే, సార్! ( వెళ్ళిపోతున్నాడు )

శంకరం: డబుల్ స్ట్రాంగ్ కావాలి.

సర్వర్: ఎస్సార్! ( వెళ్ళిపోయాడు )

శంకరం: ( మంచం మీద కూర్చుని బూట్లు విప్పుకుంటూ ) హమ్మయ్య! మొత్తానికి ఎల్లా అయితేనేం రూం సంపాదించాం. ( చుట్టూ చూస్తూ ) రూమ్ బాగుంది కదూ?

సుందరి: ( ఫాన్ స్విచ్ వేసి ) రూమ్ బాగానే ఉంది. హోటల్ మేనేజర్‌గాడే బాగాలేడు. సొట్టలు పడ్డ మరచెంబులా ముఖం వాడూ! ఆడదాన్ని ఎప్పుడూ చూడనట్టు నా వైపు అదే చూట్టం. నాకైతే ఒళ్ళు మండిపోయింది.

శంకరం: టేకిట్ ఈజీ, డార్లింగ్! ఈ హోటల్ వాళ్ళంతా ఇంతే. అంతవరకూ ఎందుకూ? రైలు దిగిం తరవాత ఈ వూళ్ళో అయిదు హోటల్స్ తిరిగాం. ఒక్కరైనా మనకి రూమ్ ఇచ్చారా? ఇవ్వరు. ఖాళీ రూములున్నా సరే ఇవ్వరు.

సుందరి: ఎందుకని?

శంకరం: అనుమానం జబ్బు! ( దగ్గరకు వస్తూ ) మనిద్దరం మొగుడూ, పెళ్ళాం కాదేమోనని వాళ్ళకి డౌటొచ్చుంటుంది.

సుందరి: ( ఆశ్చర్యపోతూ ) ఇది మరీ బాగుందండీ. మొగుడూ, పెళ్ళాం కాపోతే ఒకటే రూమ్ ఎందుకడుగుతాం?

శంకరం: నీ కర్థం కాదులే, డార్లింగ్! మొగుడూ, పెళ్ళాలు కానివాళ్ళుకూడా అలా చెప్పేసుకుని రూములు తీసేసుకుంటూంటారు. తరవాత ఏ పోలీసులో వచ్చి నిజం బైట పడితే వాళ్ళ హోటల్ ప్రిస్టేజీ పోతుందని వాళ్ళకి భయం.

సుందరి: ఏడిచినట్టే ఉంది. ( బాగ్ లోంచి టవల్ తీస్తూంది )

శంకరం: ( మూడీగా ) బాలా! మై స్వీట్ డార్లింగ్!

సుందరి: ( ఉలిక్కిపడి ) ఏమిటండీ!

శంకరం: ( రెండు చేతులూ చాచి ) బాలా! మై స్వీట్ హార్ట్! ( దగ్గరకు వచ్చేశాడు )

సుందరి: ( ఖంగారు పడిపోతూ ) అరెరె. ఏమిటండీ ఇది?

శంకరం: ఐ లవ్ యూ, బాలా! అయ్ లవ్ యూ! ఈ విషయం చెప్పాలనే పని గట్టుకుని నిన్ను హైదరాబాదు నుంచి విజయవాడ తీసుకొచ్చాను. నన్ను అర్థం చేసుకో, బాలా!

(సర్వర్ స్పీడుగా వచ్చి వాళ్ళ చేతుల్లో కాఫీ కప్పులు పెట్టేశాడు )

శంకరం: ( కోపంగా సర్వర్ వైపు చూసి కాఫీ కప్పు టీపాయ్ మీద పెట్టి ) చూడూ! ఇలా టీపాయ్ మీద పెడితే మేం తీసుకుని తాగ్గలం. చేతుల్లో పెట్టక్కర్లేదు. అర్థమైందా? దయచెయ్!

(సర్వర్ సుందరి వైపు అదోలా చూస్తూ వెళ్ళిపోయాడు )

శంకరం: ( మళ్ళీ మూడీగా మారిపోయి ) బాలా! ఇవాళే నిజంగా సుదినం. వస్తుడిగితే దేశానికి ఇవాళే స్వాతంత్ర్యం వచ్చిందంటాను. ఇంకా చెప్పాలంటే ఇవాళే మనకి దీపావళి. ఇవాళే మనకి ఉగాది. ఇవాళే మనకి సంకురాత్రి. ఇవాళే మనకి తొలిరాత్రి. ( ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తున్నాడు )

సుందరి: మీ గోలేమిటో నా కర్థం కావటం లేదు.

శంకరం: అదే. లవ్! ప్రేమ! త్రీ ఇయర్సయి మన పెళ్ళయినా...కనీసం త్రీడేస్‌కూడా మనం ఒకరినొకరు ప్రేమించుకో లేదు. ప్రేమగా చూసుకో లేదు. ప్రేమగా మాట్లాడుకో లేదు. అందుకే ఇప్పుడు మనిద్దరం కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసుకుందాం. ఒకరి గుండెలో మరొకరం ఒదిగిపోదాం.

సుందరి: ( వెనక్కి తగ్గి ) ఏమిటండీ ఇదంతా? మీ కేమన్నా పిచ్చెక్కిందా?

శంకరం: పిచ్చికాదు. పిచ్చి ఆనందం కలిగింది. వెర్రి ఆవేశం పొంగింది. అందుకే అనంతాకాశంలో అందమైన గువ్వల జంటలా, వెన్నెల పటంలా చెట్టా పట్టా లేసుకుని నాట్యం చేద్దాం.

సుందరి: ( ఖంగారుపడి ) నాట్యమా?

శంకరం: అదే! అయ్ మీన్ డాన్స్! నేను హీరోని. నువ్ హీరోయిన్‌వి! యుగళగీతం పాడుతూ డాన్స్ చేద్దాం. ఈ హోటలే మనకు నందనవనం. కాదంటే బృందావనం. ( చేతిలోకి చేయి తీసుకుని నడిపిస్తూ ) జన్మకో శివరాత్రనీ మన పెళ్ళయిన ఇంత కాలానికి ఇలాంటి ఏకాంతం దొరికింది. ( కవితా ధోరణిలో ) రావేల బాలా. నా పాలిటి అల్పేలా. సమయాన్ని వృథా చేయ నేల?

సుందరి: (నవ్వుతూ). బావుంది. కవిత్వంకూడా పుట్టుకొచ్చేస్తూంది అయ్యగారికి! అయినా, ఇన్నేళ్ళుగా ఎప్పుడూ లేనిది హఠాత్తుగా ఇంత ప్రేమ పుట్టుకొచ్చిందేమిటి శ్రీవారికి?

శంకరం: పొరపాటు. నువ్వంటే నా కెప్పుడూ ప్రేమే! నిన్న నిన్ను ప్రేమించాను. నేడూ నిన్ను ప్రేమిస్తున్నాను. రేపుకూడా నిన్నే ప్రేమిస్తాను. ( చేయి ఎగుర వేస్తూ ) ప్రేమ జయిస్తుంది. ప్రేమకు మరణం లేదు. ప్రేమే దైవం. ప్రేమా...జిందాబాద్!

సుందరి: ( నవ్వుతూనే ) అయితే ఇంక కాఫీ తాగరా?

శంకరం: అన్నంకూడా తిన్ను. (మత్తుగా చూస్తూ) నీతో కబుర్లు చెబుతూ ఆకలి మరిచిపోతాను. నీ కళ్ళల్లోకి చూస్తూ నిద్ర మానేస్తాను.

సుందరి: ( దిగులుగా ) ఈ మూడు రోజులేగా! ఆ తర్వాత హైదరాబాదు వెళ్ళిపోతే అక్కడ అత్తయ్యగారూ,మావయ్యగారూ,బుజ్జీ అందరూ వుంటారుగా?

శంకరం: అబ్బా! మహత్తరమైన మూడ్‌లోకి వెళ్ళిపోతూంటే వాళ్ళందర్నీ జ్ఞాపకం చేస్తావేమిటి, బాలా! ( పాట ధోరణిలో ) తగునా ఇది

బాలా? నీవే ఇటు పలుక తగున...తగునా ఇది బాలా? ( అంటూ ఆమెను సమీపించి,, రెండు చేతుల్లోకి ఆమెను తీసుకోబోయాడు. సరిగ్గా అప్పుడే సర్వర్ వచ్చాడు. )

( టేబుల్ మీదనున్న ఖాళీ కప్పు తీసు కుంటున్నాడు )

శంకరం: ( సీరియస్‌గా ) ఒరేయ్ పాపు! ఇలా రారా!

సర్వర్ (వచ్చి) నా పేరు పాపు కాదండి! గోపి!

శంకరం: కాదు. ఇకనుంచీ నీ పేరు పాపూయె! చూడూ! ఈ హోటల్లో ఎంతకాలంనుంచీ పని చేస్తున్నావ్?

తలుపు మీద చిన్నగా కొట్టి 'మే అయ్ కమిన్, సర్!' అని అడిగి మరీ రావాలి. అర్థమైందా?

సర్వర్: ( అయినట్లు తల వూపాడు )


శంకరం: ఇహ దయచెయ్!

సర్వర్: ( సుందరి వైపు అదోలా చూస్తూ సర్వర్ వెళ్ళిపోయాడు )

సుందరి: ( పైట చెంగు అడ్డం పెట్టుకుని నవ్వు తోంది )

శంకరం: ఎందుకలా నవ్వుతావ్?

సుందరి: ( నవ్వుతూనే ) వాణ్ణి చూస్తూంటే మీ తమ్ముడు బుజ్జిగాడు గుర్తు కొచ్చాడు.



సర్వర్: (రెండు వేళ్ళు చూపించాడు.)

శంకరం: రెండేళ్ళ నుంచా?

సర్వర్: (తల అడ్డంగా తిప్పాడు.)

శంకరం: రెండు నెలల నుంచా?

సర్వర్: ( కాదన్నట్టు తల తిప్పాడు )

శంకరం: ( ఒళ్ళు మండి ) మరి ఎంత కాలం నించి? రెండు జన్మల నించా?

సర్వర్: (తల తిప్పి ) కాదు, సార్! రెండ్రోజుల నించి! అంతేనండి.

శంకరం: అందుకే మేనర్స్ తెలుసుకో. ఇలాంటి డబుల్ రూమ్స్ లోకి వచ్చే ముందు బయట

శంకరం: ఉ! గొప్పే!

సుందరి: ( నవ్వుతూనే ) వాడుకూడా. ఇలాగే.. ( ఇంకా ఇంకా నవ్వుతూ) నిన్న సాయంత్రం మీరు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చినప్పుడు గుర్తుందా? ( సుందరి నవ్వుతూండగా వాళ్ళ దగ్గర లైట్లు ఆరిపోయాయి. మరో పక్క ఫ్లాష్ బాక్‌ని సూచించే విధంగా నెమ్మదిగా స్పాట్‌లైటు వెలుతురు వస్తూంది.)

శంకరం : ( హుషారుగా ఈల వేసుకుంటూ స్పాట్ లోకి వచ్చి) సుందరిగారూ! బాలా త్రిపుర సుందరి గారూ!

సుందరి : (లోపలనించి) ఎవరదీ?

శంకరం : వంటింట్లోంచి వసారాలోకి రండి... తెలుస్తుంది.

సుందరి : (స్పాట్‌లోకి వచ్చి) వోర్నీ మీరేనా? పేరెట్టి పిలుస్తూంటే పోస్ట్‌మానేమో అను కున్నాను. చీకటి పడేదాకా ఇంటికి రానివారు ఇవాళ ఇంత పెంద్రాలే వచ్చి వాలిపోయా రేమిటి?

శంకరం :(రెండు చేతులూ వెనక్కి పెట్టి సిగ్గుతో మెలికలు తిరుగుతూ ) ఇవాళ అమ్మా, నాన్నా ఆంజనేయులు గారింటికి పెళ్ళికి వెళ్ళారుగా! రాత్రి పెళ్ళి భోజనం అయ్యాక ఏ పదింటికో గానీ ఇంటికి రారుగా. ఈ లోగా మనం ...

సుందరి : వూ ... మనం? ...

శంకరం : ప్రేమించుకుందాం! (దగ్గరకు చేరి పాట ధోరణిలో ) వినవే బాలా! నా ప్రేమ గోలా ... వినవే బాలా ...

బుజ్జి : (వెనక్కి వచ్చి చప్పట్లు కొట్టాడు.)

శంకరం : (పాట ఆపేసి) ఎవరు? ఎవరది? ఎవరివి ఆ కరతాళధ్వనులు? నువ్వేనా, బాలా? నా పాట నచ్చిందా? ఇంకా పాడమంటావా?

సుందరి : మీ పాట నచ్చింది నాక్కాదు.

శంకరం : మరి చప్పట్లెందుకు కొట్టావ్?

సుందరి : నేను కాదు!

శంకరం : నువ్వు కాదా? నేను విన్నానే మరి! ఒకవేళ భ్రమా?

సుందరి : భ్రమేం కాదు! ఆ చప్పట్లు కొట్టిం దెవరో వెనక్కి తిరిగి చూడండి. మీకే తెలుస్తుంది ( లోపలకు వెళ్ళిపోయింది. )

శంకరం : (వెనక్కు తిరిగి చూసి, షాకై ) వోర్నీ ... నువ్వట్రా బుజ్జీ! నువ్వు పెళ్ళికి వెళ్ళలేదూ?

బుజ్జి : లే దన్నయ్యా! మా లెక్కల మాస్టారు హోం వర్కిచ్చారు. నాన్నగారు నీ చేత చెప్పించుకో మన్నారు.

శంకరం : (తనలో) హతోస్మి! నాకు డ్యూటీ వేశారా! ( పైకి) అది సరేగానీ, బుజ్జీ! నువ్వూ, మీ ఫ్రెండూ కలిసి అదేదో ఇంగ్లీషు సినిమాకి వెడతా నన్నారు. వెళ్ళారా?

బుజ్జి :( బుంగమూతిపెట్టి ) నువ్వు డబ్బులివ్వ లేదుగా!

శంకరం : ఇప్పు డిస్తాను!

బుజ్జి : ఇప్పుడా?

శంకరం : అవు నిప్పుడే! ఇవాళ ఆఖ్రోజట! బోర్డు పెట్టారు. ఖాళీగా ఉంటుంది. మళ్ళీ ఎనిమిది న్నరకి వదిలేస్తారుగా. వచ్చిం తర్వాత భోంచేసి పడుకుందువుగాని ...

బుజ్జి : మరి హోంవర్కో? నువ్ చేసేస్తావా?

శంకరం : నేనా? నేను చేస్తే నీకెలా వస్తుంది? రేపు రాత్రి చేసుకో వచ్చులే!

బుజ్జి : రేప్పొద్దున్న స్కూల్లో మా మాస్టారికి చూపించకపోతే బెంచీ ఎక్కిస్తానన్నారు.

శంకరం : వోర్నీ నీకు చెప్పలేదు కదూ! ఇందాకా నేను ఆఫీసునుంచి వస్తూంటే మీ లెఖ్ఖల

మాస్టారు కనిపించారు. 'బావున్నారా, సార్?' అని అడిగాను. 'రేపు బడికి వెళ్ళటం లేదోయ్' అన్నారు. అందుకని మువ్వూ, మీ ఫ్రెండూ హాయిగా సినిమా చూసెయ్యండి... ఆ ... ఇదిగో డబ్బులు! (అయిదు రూపాయల నోటు చేతిలో పెట్టి) తొందరగా పరుగెత్తు. మళ్ళీ బుకింగ్ మూసేస్తే కష్టం!

బుజ్జి : (వెళ్ళిపోయాడు.)

శంకరం : హమ్మయ్య... వెళ్ళిపోయాడు.

సుందరి : (నవ్వుతూ) కష్టపడ్డారుగానీ, కాఫీ తీసుకోండి.

శంకరం : థాంక్స్! ఒక్క గుక్కలో తాగేసి కప్పు ఇచ్చేశాడు. (సుందరి వెళ్ళిపోతుంటే) ఆగు ... వెళ్ళిపోకు, బాలా! ఇదిగో!

సుందరి : ఏమిటి?

శంకరం : ఉండూ! జేబులోంచి తియ్యనీయ్! (మల్లెపూల పొట్లం తీశాడు.)

సుందరి : అమ్మో! మల్లె పూలు!

శంకరం : (గర్వంగా) మల్లె పూలతోబాటు మరో శుభవార్త.

సుందరి : ఏమిటి?

శంకరం : ఇవాళ మాకు బోనస్ ఇచ్చారు.

సుందరి : (ఉత్సాహంగా) అలాగా! ఎంతిచ్చారూ?

శంకరం : అయిదు వందలు. ఫైవ్ హండ్రడ్. రేపు ఆఫీసుకి సెలవు పెట్టాను. మనిద్దరం రేపు మధ్యాహ్నం షాపింగ్‌కి వెడదాం. నీకు ప్రెజెంటేషన్ ఏం కావాలో కొనుక్కో. కొనేస్తాను. ఆ తర్వాత అశోకా హోటల్లో టిఫిన్ తిని ఫస్ట్ షో సినిమా చూద్దాం. సినిమా అయిం తర్వాత అన్నపూర్ణా హోటల్లో భోంచేసి ఇంటి కొద్దాం.

సుందరి : (నిష్ఠూరంగా) ఏం వద్దులెండి!

శంకరం : అదే మీ ఆడవాళ్ళతో వచ్చిన చిక్కు! మొగుడు సరదాగా ఉన్నప్పుడు ఆ సరదాలో పాలుపంచుకోవాలనీ, హుషారుగా ఉండాలనీ అనుకోరు. నిప్పుల మీద నీళ్ళు చల్లినట్లు ఆ ఆనందాన్ని ఆర్పి పారేస్తారు.

సుందరి : అవును. ఎంతసేపూ మీ సరదాల్లో పాలుపంచుకోవటం, మీ సరదాలు తీర్చటం తప్ప మా సరదాలు మీకేం పట్టవ్.

శంకరం : ఇప్పుడు నీ సరదా నే నేం కాదన్నాను చెప్పు?

సుందరి : పెళ్ళయి మూడేళ్ళు కావస్తోంది. ఈ మూడేళ్ళ లోనూ 'హనీమూన్‌కి వెడదామండీ' అని కనీసం ముప్పయి మూడు సార్లయినా అడిగాను. తీసుకెళ్ళారా? కొన్నాళ్ళు పెద్దతమ్ముడి గారి చదువుతో సరిపోయింది. ఆయన చదువై ఉద్యోగానికి వెళ్ళిపోయాడూ అనుకుంటే—ఆ తర్వాత చెల్లెలి పెళ్ళి ఖర్చు...డబ్బుంటే శలవు ఉండదు. శలవుంటే డబ్బుండదు. రెండూ ఉంటే వీలుండదు! మీ చెల్లెలు చూడండి! పెళ్ళయిన అయిదో రోజునే అయిసర బజ్జా అంటూ మొగుడితో మైసూరూ, బెంగుళూరూ వెళ్ళొచ్చింది!

శంకరం : (బాధగా) అవును, బాలా! పెళ్ళినాటి సౌఖ్యం లంఖణాల నాడు తల్చుకున్నట్టుంది నా పని! అసలు, ఇంట్లో పెద్ద కొడుగ్గా పుట్టే కంటే అడవిలో ఆముదం చెట్టుగా పుట్టటం మంచిదన్నా రందుకే! మన సరదాలకీ సంతోషాలకీ డబ్బు ఎలాగా ఖర్చు పెట్టుకోలేం. కనీసం మనసు విప్పి మాట్లాడుకోవాలన్నా ఈ ఉమ్మడి కుటుంబంలో వీలు పడటం లేదు. భర్తగా—నేను నీకు అన్యాయమే చేస్తున్నాను, బాలా! క్షమించు!

సుందరి : (నొచ్చుకుని) ఏమండీ! ఏమిటా మాటలు? తొందరపడి అడిగాను. మీ మనసు నొప్పించాలని కాదు. ఊ! ఈ పువ్వులు మీరే పెట్టండి! (వెనక్కి తిరిగింది.)

(శంకరం పువ్వులు పెడుతున్నాడు.)

సుందరి : రేపు మీతో సినిమాకి వస్తానండి!

శంకరం : (తనవైపు తిప్పుకుని) నో! రేపు మనం సినిమాకి వెళ్ళేది లేదు. ప్రేమయాత్రకి వెడుతున్నాం.


## ఎస్. ఎస్. ఆర్. బాలికల విద్యాకేంద్రము

ఎస్.ఎస్.సి. మరియు ఇంటర్ మీడియట్ సప్లిమెంటరీ '81 తరగతులు

**(తెలుగు, ఇంగ్లీషు మీడియములలో)**
ప్రారంభించబడినవి.

కంపార్టుమెంటల్ పద్ధతిలో కూర్చొనువారికి ప్రత్యేక శిక్షణా తరగతులు కలవు.

ఎస్.ఎస్.సి., ఇంటర్‌మీడియట్ ఏప్రిల్ '82 తరగతులు ప్రారంభమైనవి.

**వివరములు ఆఫీసునందు తెలుసుకొనగలరు.**

ఫోను : పి. పి. 56526.

**బ్యాంకు వీధి, హైదరాబాదు-1.**

డైరెక్టరు.



## వధువు కావలెను

ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా ప్రాక్టీసు చేయుచున్న 30 సం॥ వయస్సు గల శ్రీవత్సస గోత్ర వెలనాటి వైదిక బ్రాహ్మణ వరునకు సాంప్రదాయ కుటుంబమునకు చెందిన అందము, చురుకుదనము, సంస్కార హృదయముకల 24-27 సం॥ మధ్య వయస్సు 5'-5" ఎత్తుగల (ప్రాక్టీసు చేయుటకు సుముఖతగల) డాక్టరు/మెడికో వధువు కావలెను. పూర్తి వివరములతో సంప్రదించవలెను.

**బాక్సు నెం. 190,**

**C/o. ఆంధ్రప్రభ**

**సచిత్ర వారపత్రిక.**

**దోమలగుడ, హైదరాబాదు-29.**

సుందరి : ప్రేమయాత్రా?!

శంకరం : అదే హనీమూన్! రేపు ముందుగా బెజవాడ వెడదాం. రాత్రి అక్కడే హోటల్లో మకాం. ఎల్లుండి మద్రాస్. అక్కడి నుంచి మహాబలిపురం. హాయిగా నాలుగు రోజులు అలా అలా అలా తిరిగొద్దాం.

సుందరి : మీ నాన్నగారు ఒప్పుకోవద్దూ?

శంకరం : సరిపోయింది! 'నాన్నగారూ! మేం ప్రేమయాత్రలకి వెళ్ళొస్తాం ఆశీర్వదించి పంపించండి' అని అడుగుతా ననుకున్నావా?

సుందరి : మరి 'ప్రయాణం ఎక్కడికి' అని అడిగితే ఏం చెప్తారూ?

శంకరం : స్టోరీ చెప్తాను.

సుందరి : స్టోరీయా?

శంకరం : అవును! ప్రేమించిన భార్య ఆనందంకోసం అవసరమైతే భర్త స్టోరీలు చెప్పాలి. షాజహాన్ చక్రవర్తి తన భార్యకోసం అద్భుతమైన తాజ్ మహల్ కట్టించాడు. అలాంటిది...నేను ఆఫ్టరాల్ ఒక అందమైన అబద్ధం చెప్పలేనా?

సుందరి : (నవ్వుతూ) ఏం చెప్తారూ?

శంకరం : 'తిరుపతి వెళ్ళి ఏడుకొండలవాడి దర్శనం చేసుకొస్తాం' అని చెప్తాను.

సుందరి : 'అయితే మరో రెండు టిక్కెట్లు ఎక్కువ తీసుకో' అంటారు.

శంకరం : ఎందుకూ?

సుందరి : మీ నాన్నగారికీ, అమ్మగారికీ మొక్కుందిగా? అందుకు!

శంకరం : చచ్చాం! అదో డేంజరుందా' (క్షణం ఆలోచించి) ఆఁ ... అయితే ఒకపని చేద్దాం. మా ఫ్రెండు పెళ్ళికని చెబుదాం.

సుందరి : దానికి నాలుగు రోజు లెందుకు అంటే?

శంకరం : ఏం... ఎందుకేమిటి? విశాఖపట్నంలో పెళ్ళయితే నాలుగు రోజులు అవసరం ఉండదా?

సుందరి : (నవ్వుతూనే) శుభలేఖ చూపించమంటే?

శంకరం: ఆఫీసులో పెట్టి మరిచిపోయానని కోస్తాను. అయినా, మా నాన్నకంటే నువ్వే ఘోరమయి పోతున్నా వేమిటి? ఆట్టే కబుర్లు చెప్పక— పొద్దున్నే లేచి రెడీ అయిపో! పది గంటల బస్సులోనే మన ప్రయాణం.

బుజ్జి : (వస్తూ) ఎక్కడి కన్నయ్యా! నేనూ రావద్దూ?

శంకరం : చచ్చాం! నువ్ సినిమాకి వెళ్ళలేదట్రా, బుజ్జీ.

బుజ్జి : లే దన్నయ్యా! మా ఫ్రెండు సర్వేశ్వర్రావ్ ఆ సినిమా నిన్ననే చూసేశాట్ట...రా నన్నాడు.

శంకరం : ఆ ఘోరించలేకపోయాడు. డబ్బులు పెడతానన్నా రానన్నాడంటే—వాడికి బాగుపడే లక్షణాలు బొత్తిగా లేవన్నమాట ... పోనీ విశ్వేశ్వర్రావ్‌ని రమ్మనక పోయావా?

బుజ్జి : వాడు మళయాళం సినిమాలు తప్ప మరేం చూడట్ట.


శంకరం : సర్లే...పుస్తకాలు తీసి చదూకో.

బుజ్జి : హోంవర్కు చెప్పన్నయ్యా!

సుందరి : పాపం—హోంవర్కో అంటున్నాడు...కాస్త చెప్పకూడదుటండీ?

శంకరం : (కోపంగా పళ్ళు పిండుకుంటూ) అలాగే చెప్తాను. ఇంక నాకు వేరే పనేముంది? బుజ్జిగాడికి హోంవర్క్ చెప్తాను...ఈలోగా పెళ్ళికెళ్ళిన అమ్మా, నాన్నా ఎలాగా వచ్చేస్తారు. అయినా ఆఫీసునించి నేను పెందరాళే ఇంటి కొచ్చింది, హోంవర్కు చెప్పటానికేగా? చెప్తానోయ్...బుజ్జిగాడికి హోంవర్కే చెప్తాను... (బుజ్జితో) ఇంకా నిలబడ్డావేమిట్రా? పోయి పుస్తకాలు తెచ్చుకో...హోంవర్కు చెబుతాను. (స్పాట్‌లైట్ నెమ్మదిగా ఆరిపోయింది. ఇప్పుడు కుడివైపున మళ్ళీ మామూలుగా వెలుతురు వస్తుంది. అంతకుముందు నిలబడిన స్థలాలలో శంకరం, సుందరి నిలబడి ఉన్నారు. అంతకుముందులాగనే, సుందరి నవ్వుతూనే ఉంది.)

శంకరం : ఊఁ. సంతోషించాంలే. ఇంక నవ్వాపెయ్. నువ్వెళ్ళి స్నానం చేసిరా! అదిగో...



—ఫోటో: ఎల్. ఆర్. గ్రోవర్

అది బాత్‌రూం...లోపల వేన్నీళ్ళుంటాయేమో చూడు! ఆఁ... ఇదిగో టవల్ తీసుకెళ్ళు. (ఇచ్చాడు).

(సుందరి టవల్, చీరా భుజంమీద వేసుకుని సోప్ బాక్స్ తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళింది)

శంకరం : (మంచంమీద తలగడలు సరిగా సర్దుతూ) ఎంత హాయి ఈరేయి....ఎంత మధుర మీ హాయి...చందమామ చల్లగా... మత్తుమందు జల్లగా (అంటూ పాట హమ్ చేస్తున్నాడు. ఇంతలో తలుపు చప్పుడయింది.) ఎవరది? ఎస్...కమిన్?

సుబ్బలక్ష్మి : (హొయలుగా లోపలకు నడిచివస్తూ) నమస్తే, సార్!

శంకరం : (ఖంగారుపడి) న...నమస్తే...మి..... మీరూ...?

సుబ్బలక్ష్మి : నా పేరు సుబ్బలక్ష్మి. కానీ, ఈ క్షణంనించీ మీ కే పేరు బావుంటే ఆ పేరెట్టి పిలవచ్చు.

శంకరం : (ఇబ్బంది పడుతూ) ఎవరికోసం వచ్చారూ?

సుబ్బలక్ష్మి : (దగ్గరకు వస్తూ) మీకోసమే, సార్!

శంకరం : (వెనక్కి అడుగేసి) నా కోసమా?... క్షమించాలి! మీరు పొరపాటున ఒక రూమ్ అనుకుని మరో రూంలోకి వచ్చి ఉంటారు.

సుబ్బలక్ష్మి : భలేవారే! స్వాగ్గాని చత్వారం ఉందనుకున్నారా? ఈ రూం నెంబరు రెండు వందల మూడు! తలుపుమీద అంకెలు చూసి మరీ వచ్చాను.

శంకరం : అలాగా!

సుబ్బలక్ష్మి : అవును, సార్! అసలు అయిదుగంటల లోపే వద్దామనుకున్నాను, సార్...కానీ, అప్పుడైతే వాళ్ళూ వీళ్ళూ ఉంటారూ. నా గురించి వివరంగా చెప్పుకునేందుకు వీలుపడదు అని, కావాలనే ఆలస్యంగా వచ్చాన్సార్! ఇప్పుడు ఇక్కడ ఇంక ఎవ్వరూ లేరు. మీరు నన్నెలా పరిరక్షించుకున్నా సరే! డాన్స్ చేయమంటే డాన్స్ కూడా చేస్తాను.

శంకరం : (ఉలిక్కిపడి) డ. డాన్స్ కూడా చేస్తావా?

సుబ్బలక్ష్మి: ఒక్క డాన్సే కాదు, సార్...పాట కూడా పాడగలను. ప్లీజ్...నన్ను బుక్ చేసేసుకోండి, సార్.

శంకరం : (సాలోచనగా) బుక్ చేసుకోవటమంటే...

సుబ్బలక్ష్మి : పోనీ హీరోయిన్ కాకపోతే—సైడు రోలిచ్చినా ఫరవాలేదు, సార్.

శంకరం : సైడు రోలా...ఓహో.. .అర్థమైంది! సినిమాలో వేషంకోసం వచ్చావన్నమాట!

సుబ్బలక్ష్మి : (ఆశగా) అవును, సార్! మీ పేరు జన్మలో మరచిపోను. నేను పెద్ద స్టారు నయ్యాక మీరు తీసే ప్రతీ పిక్చర్లోనూ ఫ్రీగా యాక్ట్ చేస్తాను సార్.

శంకరం : చూడమ్మా...తప్పెడ్రస్సుకి వచ్చావ్! నువ్వెళ్ళవలసింది దాసరి నారాయణరావుగారి దగ్గరికి! నా దగ్గరికి కాదు. నేను సినిమా ప్రొడ్యూసర్నీ కాదు, డైరెక్టర్నీ కాదు..... ఇన్స్యూరెన్సు కంపెనీలో క్లార్కుని!

సుబ్బలక్ష్మి : (తెల్లబోతూ) ఇన్స్యూరెన్సు కంపెనీలో క్లార్కా? (హేండ్‌బేగ్‌లోంచి పేపరు తీస్తూ) మరి ఈ పేపర్లో ప్రకటన ఇలా ఇచ్చారేమిటి?

శంకరం : ఎలా ఇచ్చారూ?

సుబ్బలక్ష్మి : ఇదిగో చూడండి (పేపరు అతని కిచ్చింది)

శంకరం : (పేపరు మడత విప్పి చదువుతూ) "కావలెను...హాంఫట్ ప్రొడక్షన్ పేరుతో మేం తీయబోయే నూతన చిత్రంలో హీరో, హీరోయిన్లుగా నటించడానికి కొత్త తారలు కావలెను. అందమూ, అభిరుచీ కల యువతీ యువకులు ఈ నెల పదహారో తేదీ సాయంత్రం అయిదు గంటలలోపుగా గాయత్రీ హోటల్లోని రెండువందల మూడో నెంబరు రూమ్‌లో ప్రొడ్యూసర్‌గార్ని స్వయంగా కలుసుకోవచ్చును. ఇట్లు...హాంఫట్ ప్రొడక్షన్స్,

విశాలాక్షి వీధి, విజయవాడ—16" (పేపరు మడిచేస్తూ) బావుంది. చూడమ్మా సుబ్బలక్ష్మీ! ఈ ప్రొడ్యూసర్‌గారెవరో బహుశా అయిదు గంటలకి ఈ రూమ్ ఖాళీచేసి వెళ్ళిపోయుంటాడు. యూ ఆర్ టూ లేట్ (పేపరు తిరిగి ఇచ్చేశాడు)

సుబ్బలక్ష్మి (పేపరు అందుకుంటూ) అన్నారా? మీరూ అదే మాటన్నారా? మా అమ్మా, నాన్నా కూడా నన్నెప్పుడూ అలాగే అంటూంటారు, సార్! (దిగులుగా) ఇప్పుడు నాకేమిటి దారి?

శంకరం : అదిగో...అదీ దారి. వెళ్ళి రావమ్మా. (దారి చూపించాడు)

సుబ్బలక్ష్మి : థాంక్యూ, సార్! వస్తాను. (వెడుతూ మళ్ళీ ఒక అడుగు వెనక్కి వచ్చి) సార్! మెడ్రాసులో మీరు ఎరిగున్న డైరెక్టరుగానీ, ప్రొడ్యూసర్ గానీ ఉంటే చెప్పండి, సార్, వెళ్ళిపోతాను.

శంకరం : చూడమ్మా! చాలా అమాయకురాలిలా కనిపిస్తున్నావ్. తొందరపాటు పనికిరాదు. వయసొచ్చిన ఆడపిల్లవి! సినీమాల్లో వేషం కోసం ఇలా హొటల్స్ చుట్టూ తిరిగితే, నీ పరువు బజారుపాలై పోతుంది. నా మాటలు విని తిన్నగా ఇంటి కెళ్ళు. అదృష్టం బాగుంటే ఏ సినీమా ప్రొడ్యూసరో, డైరెక్టరో తిన్నగా మీ ఇంటికే వచ్చి నిన్ను బుక్ చేసుకుంటారు.

సుబ్బలక్ష్మి : అప్పటికి టూలేటయి పోతుం దేమో, సార్!

శంకరం : అయినా ఫరవాలేదమ్మా. టాలెంట్ ఉండాలే కానీ, తల్లి వేషాలయినా వేయచ్చు!

సుబ్బలక్ష్మి : అంతేనంటారా? సరే, సార్! అయితే, ఇంటికే వెళ్ళిపోతాను (వెళ్ళిపోయింది)

సుందరి : (బాత్‌రూంలోంచి వస్తూ) ఎవరండీ అది?

శంకరం : ఎవరో. మనకోసం కాదులే!

సుందరి : కాకపోతే అంతసే పెందుకు మాట్లాడుతారూ? ఎవరిదో ఆడగొంతుక! బాత్‌రూంలోకి స్పష్టంగా వినిపించింది.

శంకరం : అవును, డాలింగ్! ఎవరో ఆడపిల్ల. ఈ రూమ్‌లో ఇంతకు ముందెవరో సినీమా ప్రొడ్యూసర్ ఉన్నాట్ట. వేషం కావాలని అడగటానికి వచ్చింది. 'టూలేట్' అని చెప్పాను. ఏడుపు ముఖం పెట్టుకుని వెళ్ళిపోయింది పాపం! అది సరే కానీ, బాత్‌రూంలో వేన్నీళ్ళు వస్తున్నాయా?

సుందరి : (పౌడరు డబ్బా తీసుకుంటూ) ఆ... ప్రాణానికి హాయిగా ఉందిప్పుడు! మీరు కూడా స్నానం చేసిరండి! సోపూ, టవలూ అక్కడే ఉంచాను.

శంకరం : ఒ కే! క్షణంలో వచ్చేస్తాను. (ఈల పాట పాడుకుంటూ బాత్‌రూంలోకి వెళ్ళిపోయాడు. సుందరి పౌడరు రాసుకుని, బొట్టు పెట్టుకుని, జడలో పువ్వులు కూడా పెట్టుకుంది...ఈలోగా)

ఆనందరావు : మే అయ్ కమిన్ ప్లీజ్? (అంటూ లోపలకు వచ్చేశాడు)

సుందరి : ఎవరూ?

ఆనందరావు : (నాటక ఫక్కీలో) ఆహా...ఏమి ఈ అపురూప రూపసౌందర్యమూ? అనుపమానమై ఆశ్చర్యజనకమై—అపురూపదృశ్యమై అలరారుచున్నది. ఒహ్హో!

సుందరి : (కంగారుగా) ఏయ్...ఏయ్! ఎవరు నువ్వు?

ఆనందరావు : (ఆమె ముందుకు వస్తూ, నడుం మీద చేతులు వేసుకుని) పాంచాల పురాధీశ్వరుడౌ ద్రుపదునిచే కవ్వించబడి, మత్స్య యంత్ర ఛేదనము చేసినంత మాత్రాన పాండవులు మహావీరాగ్ర గణ్యులైనారా? అహహ్హా! కపట విప్రవేషధారులై శ్రీకృష్ణుని అభిమతంబున మగధకు చేరి మాయావరంబున ఆ జరాసంధుని యుద్ధమునకు ఆహ్వానించి, గదాయుద్ధమందు ధర్మ విరుద్ధంగా కపటోపాయముగా శాపగ్రస్తుడైన ఆ మగధాదీశుని చీల్చి చెండాడి అంత మొందించినంత మాత్రాన వీరాధి వీరులైనారా ఈ పాండవులు? ఇంతటి స్వల్ప కృత్యమ్మునకే అంతటి ఆర్భాటమా?


వెలువడినవి! వెలువడినవి!!

ప్రసిద్ధ నవలా రచయిత్రి

ఆర్. సంధ్యాదేవి నవల

ప్రేమ సామ్రాజ్యం రు. 16-50

మాలతీచందూర్

ప్రమదావనం

ప్రశ్నలు-జవాబులు రు. 15.00

ప్రమదావనం

జాబులు-జవాబులు రు. 13-00

ఏమిటీ జీవితాలు రు. 12-00


(డైరెక్టు నవల)

పుస్తకాల ధర ముందుగా M.O. పంపినవారికి 0-25 పైసలకు V.P.P. లో పంపగలం.

క్వాలిటీ పబ్లిషర్స్,

రామమందిరం వీధి, విజయవాడ-2.





టి. వి. భాస్కర్

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవము" అన్న మహనీయుల సూక్తుల బాణి మా వాణి. K.G. నుండి X క్లాసు వరకు మాంటిస్సోరీ విధానములో రెగ్యులర్ స్కూల్. 7th ఆంధ్రా మెట్రిక్ S.S.C. '81 సప్లమెంటరీ, S.S.C. '82 క్లాసులకు ఏ పూర్వ విద్యార్హత లేకపోయినను, తర్ఫీదు నిచ్చి మొదట ప్రయత్నంలో పాసు చేయించుట మా ప్రత్యేకత. ఇంటర్, B.A, B.Com. క్లాసులకుకూడా అడ్మిషన్స్ మొదలు అయినవి, క్లాసులు 15—7—81 నుండి ప్రారంభమ యినవి. ఉదాహరణకు 7వ తరగతి నుండి వచ్చి 9 నెలలలో S.S.C. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైన విద్యార్థి ఫోటో, నెంబరు (310323) పొందుపరచడమైనది.

త్వరపడండి. కొద్ది సీట్లు మాత్రమే కలవు.

ప్రసూనా ట్యుటోరియల్స్

& మాంటిస్సోరీ

పబ్లిక్ స్కూల్, హాస్టలు వసతి కలదు.

స్టేషను రోడ్డు, సికింద్రాబాద్.

అహ్హాహ్హాహ్హా ! (వికటంగా నవ్వుతున్నాడు)

సుందరి : (తేరుకుని) అవు, తమ్ముడూ ! న వ్వాపెయ్ !

ఆనందరావు : (ఉత్సాహంగా) ఏకపాత్రాభినయం బావుందా, మేడం ?

సుందరి : చాలా బావుంది ! మన పేరేమిటి?

ఆనందరావు : ఆనందరావండి !

సుందరి : బావుంది...పేరు కూడా చాలాబావుంది. సినిమాల్లో వేషం కావాలా?

ఆనందరావు (ఉత్సాహంగా) ఎస్, మేడం ! నాకు స్టేజీ ఎక్స్‌పీరియన్స్ చాలా ఉంది. మీరు బహుశా ప్రొడ్యూసర్ గారి భార్యగా రను కుంటాను. ఎలా అయినాసరే నన్ను వారికి రికమెండ్ చేసి పుణ్యం కట్టుకోవాలి, మేడం! మీ తమ్ముడు లాంటివాణ్ణి !

సుందరి : అలాగే ! కానీ, నువ్వో విషయం తెలుసు కోవాలి, తమ్ముడూ !

ఆనందరావు : చెప్పండి, మేడం!

సుందరి : ఈ రూమ్‌లో ఉండే సినిమా ప్రొడ్యూ సర్ గారెవరో—గది ఖాళీచేసి వెళ్ళిపోయి చాలాసేపయింది.

ఆనందరావు : అయ్యో ! వెళ్ళిపోయారా?

సుందరి : నేనూ, మావారూ ఇప్పుడే ఈ గదిలోకి వచ్చాం. మావారిపేరు శంకర్రావ్‌గారు — సినిమా ప్రొడ్యూసర్, డైరెక్టరూ కాదు ! ఎల్లయిసీలో క్లార్కు ! అర్థమైందా?

ఆనందరావు: అయిపోయింది, మేడం! అయామ్ వెరీ సారీ...వస్తాను. (వెళ్ళిపోయాడు)

శంకరం : (బాత్‌రూంలోంచి వస్తూ) ఎవరది, డార్లింగ్?

సుందరి : ఎవ్వరూ లేరు !


శంకరం : లేకపోవడమేమిటి? ఎవడో మగ గొంతు ! బాత్‌రూంలోకి స్పష్టంగా విని పించింది.

సుందరి : అవునండీ...ఇందాకా మీ దగ్గరికి హీరోయిన్ వచ్చినట్టే ఇప్పుడు నా దగ్గరికి ఒక హీరో వచ్చాడు !

శంకరం : సరిపోయింది ! ఈ ప్రొడ్యూసర్ ఎవడో కానీ బలే కుంపటి పెట్టేశాడే మనకి !
(తలుపు చప్పుడైంది)
అదిగో...మళ్ళీ ఎవరో వచ్చారు. ఇహ ఈ రాత్రి మనం మాట్లాడుకోవటం మానేసి హీరో హీరోయిన్లు చెప్పే మాటలు వినాలి కాబోలు ఖర్మ ! (మళ్ళీ చప్పుడవుతుంది) తలుపు తీసే ఉంది, మహాశయా! లోపలకు దయచేయండి. (సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సద్గుణ రావ్ యూనిఫాంలో ప్రవేశిస్తాడు.)

సుందరి : (ఖంగారుగా) ఏమండీ! పోలీసు ఇన్‌స్పెక్టరండీ !

శంకరం : (సుందరితో) ఛ! నిజం ఇన్‌స్పెక్టరు కాదులే...నువ్వుండు ! నేను టాకిల్ చేస్తాను. (ఇన్‌స్పెక్టరుతో) ఏం మిస్టర్? ప్రొడ్యూసరు గారికోసం వచ్చావా? ఏకంగా వేషం కూడా





# సత్వర నివారణకు శక్తివంతమైన మరియు విశ్వసనీయమైన అనాసిన్ తీసుకోనండి.

**బలీయమైనది!** అనాసిన్ నొప్పిని త్వరితంగా తగ్గిస్తుంది ఎందువల నంటే ప్రపంచమంతటా డాక్టర్లు సిఫారసు చేసే బాధా నివారక పదార్థాలను అది ఎక్కువగా కలిగియున్నది.

**విశ్వసనీయమైనది!** అనాసిన్ డాక్టరు ఇచ్చే విశ్వసనీయమైన ప్రిస్క్రిప్షన్ లాగా ఒక మందుల మిశ్రమం. అందువల్లనే లక్షలాది ప్రజలు అనాసిన్‌ను తీసుకొంటారు మరియు సిఫారసు చేస్తారు.

*జలుబులు మరియు ఫ్లూ, తలనొప్పి, నడుము నొప్పి, కండరాల నొప్పి మరియు పంటి నొప్పికి బాగా పనిచేస్తుంది.*



శక్తివంతమైన మరియు విశ్వసనీయమైన
మేనర్స్
**అనాసిన్***

**భారతదేశపు ఎక్కువ జనప్రియమైన నొప్పి నివారిణి**
**జెఫ్రీ మేనర్స్ వారి అనాసిన్ విభాగం నుంచి**

*Regd. TM

A22-7/77

వేసుకొచ్చావే? (ఇన్‌స్పెక్టర్ కాలర్ సవరిస్తూ ) అది సరే...హీరో కావాలని ప్రకటన ఇస్తే పోలీసు ఇన్‌స్పెక్టర్ వేషం వేసుకొచ్చావేమిటి ? కానీ, సర్వనాలిటీ బావుంది. ట్రై చేస్తే పనికొస్తావ్. కానీ, బేడ్‌లక్ ! ఆ సినిమా ప్రొడ్యూసర్ ఎవడో కానీ, ఈ రూమ్ ఖాళీచేసి వెళ్ళిపోయాడు.

ఇన్‌స్పెక్టర్ : నేను సినిమాలో వేషంకోసం ఈ వేషం వేసుకురాలేదు, మిస్టర్ ! డ్యూటీమీద వచ్చాను. అయామ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పద్మనాభరావు.

శంకరం : అలాగా ?

ఇన్‌స్పెక్టర్ : మన సర్వీసెంతో తెలుసా? ట్వెంటీ ఇయర్స్...కళ్ళలోకి చూశామంటే చాలు— కథంతా తెల్సిపోతుంది !

శంకరం : ( నొచ్చుకుంటూ ) అయామ్ సారీ ! ఇంతకుముందు ఎవరెవరో సినిమాల్లో వేషాల కోసం వస్తేనూ—మీరూ ఆ బాపతే అనుకున్నాను. అవునూ—ఇంతకీ మీరెందుకొచ్చినట్టూ ?

ఇన్‌స్పెక్టర్ : (లాటీ అరచేతిలో కొట్టుకుంటూ) అరెస్టు చేయడానికి.

సుందరి : (ఉలిక్కిపడి ) అరెస్టా ? ఎవర్నండీ?

శంకరం : నీకు తెలీదులే, డార్లింగ్ ! సినిమాలో వేషాలిస్తామని మోసంచేసి డబ్బు గుంజుతూంటారు కొంతమంది. బహుశా ఈ రూంలో దిగిన ఆ ప్రొడ్యూసరు ఎవరో గాని అలాంటి ఫోర్ట్వెంటీ అయ్యుంటాడు. (ఇన్‌స్పెక్టర్ దగ్గరకు వచ్చి ) అయ్యా! చూడండి ఇన్‌స్పెక్టరుగారూ! మీరు ఏ ప్రొడ్యూసర్‌గారికోసమైతే వచ్చారో సదరు ప్రొడ్యూసరుగారు ఈ రూం ఖాళీ చేసి వెళ్ళిపోయారు.

ఇన్‌స్పెక్టర్ : నాకు అంతా తెలుసు, మిస్టర్! నే నొచ్చింది నిన్ను అరెస్టు చేయటానికి !

శంకరం : (షాక్తై ) నన్నా?

ఇన్‌స్పెక్టర్ : ఎస్..నిన్నే !

శంకరం : ఎందుకూ?

ఇన్‌స్పెక్టర్ : అభం శుభం తెలియని ఒక ఆడపిల్లని మోసంచేసి లేపుకొచ్చినందుకు !

శంకరం : ఇన్‌స్పెక్టర్‌గారూ ! ఏమిటి మీ రనేది? నేను...ఆడపిల్లని మోసం చేశానా?

సుందరి : (ఏడుపు ప్రారంభిస్తూ ) అవును ! చేసే ఉంటారు. పోలీసులు అబద్ధాలాడరు. చెప్పండి ఎవ రా పిల్ల? మాట్లాడరేం? ఇందాకా నేను బాత్‌రూంలో ఉన్నప్పుడు వచ్చిన పిల్లే కదూ? హాఁ! కట్టుకున్న పెళ్ళాన్ని నేను పక్కనుండగానే ఇంకో రూమ్‌లో ప్రియురాల్ని పెట్టి రహస్యంగా మీ ప్రేమాయణాలు సాగిస్తున్నారన్నమాట ! ఇంక నేను ఎవరి కోసం బతకాలి? (ఏడుస్తూంది )

ఇన్‌స్పెక్టర్ : (చిరాగ్గా) స్టాపిట్.... ఈ కల్లబొల్లి ఏడుపులూ, కాకమ్మ కథలూ నా దగ్గర పనికిరావు. మన సర్వీసెంతో తెలుసా? ట్వెంటీ ఇయర్స్. కళ్ళల్లోకి చూశామంటే చాలు—కథంతా తెల్సిపోతుంది. (సుందరి ముందుకు వెళ్ళి) నీ పేరు సరస్వతి కదూ?

సుందరి : (ఏడవు మానేస్తూ) సరస్వతా? కాదండీ. నా పేరు సుందరి... త్రిపురసుందరి.

ఇన్‌స్పెక్టర్ : వూరు వదిలిపెట్టి వచ్చేసింది చాలక పేరు కూడా మార్చేసుకున్నావన్నమాట! ఆల్ రైట్! (ఆమె చుట్టూ తిరుగుతూ) మీ నాన్నగారి పేరు జగన్నాథంగారు. ఆయిల్ మర్చంట్. అగ్రహారం వీధి. అమలాపురం! (ఆగిపోయి) అవునా?

సుందరి : కాదండీ... మీరేదో పొరపాటు పడుతున్నారు. మాది అమలాపురం కాదు. హైదరాబాదు. మా అమ్మగారూ, అన్నయ్యా అమీర్‌పేటలో ఉంటున్నారు. అత్తగారూ, మావగారూ అంబర్‌పేటలో ఉన్నారు. మా నాన్నగారు చాలా కాలం క్రితం పోయారు.

ఇన్‌స్పెక్టర్ : స్టాపిట్! ఇంట్లోంచి లేచిపోయొచ్చింది చాలక, నీ కోసం బెంగతో మంచం పట్టిన కన్న తండ్రిని పోయినవాడితో జమకడతావా?—ను వ్వసలు ఆడదానివేనా? నీ కసలు హృదయం ఉందా?

శంకరం : సార్! మీరు తొందరపడుతున్నారు. ఈమె నా భార్య!

సుందరి : అవునండీ!

శంకరం : మా పెళ్ళయి మూడేళ్ళయింది. మాది హైదరాబాదు. నాకు ఎల్లైయిసీలో పని. కావాలంటే వాకబు చేసుకోండి!


ఇన్‌స్పెక్టర్ : లాడ్జీలకు అమ్మాయిల్ని తీసుకొచ్చే వాళ్ళంతా ఇలాంటి కథలే చెప్తారు, మిస్టర్! ఇలాంటి కేసులు సవాలక్ష చూశాను. మన సర్వీసెంతో తెలుసా?



శంకరం : ట్వెంటీ ఇయర్స్!
ఇన్‌స్పెక్టర్ : కళ్ళల్లోకి చూశావంటే చాలు—
శంకరం, సుందరి : కథంతా చెప్పేయగలరు.
ఇన్‌స్పెక్టర్ : కరెక్ట్! ఈ అమ్మాయి పేరు సరస్వతి. వూరు అమలాపురం! మళ్ళీపెట్టి సువ్ తీసు కొచ్చావ్. వాళ్ళ నాన్నగారు పోలీసు కంప్లయింట్ ఇచ్చారు. ఇవాళ్టి పేపర్లో ఫోటో వేయించి ప్రకటన కూడా ఇచ్చారు. కావాలంటే ఇదిగో.... పేపరు కటింగ్. చూడు!. (జేబులోంచి తీసి ఇచ్చాడు.)
శంకరం : (చూసి) ఈ ఫోటోలో ఉన్న అమ్మాయికీ, మా ఆవిడకీ అసలు పోలికలే లేవు కదండీ?... పైగా బొమ్మంతా అలుక్కుపోయినట్టుంది కూడానూ.
ఇన్‌స్పెక్టర్ : కావచ్చు. ఫోటోలో బొమ్మకీ, అసలు మనిషికీ ఒకోసారి తేడాలుండచ్చు.
శంకరం : (చిరాగ్గా) మరి అలాంటప్పుడు మా ఆవిడే ఈ ఫోటోలో ఉన్న అమ్మాయని ఎందు కనుకో వాలి?
ఇన్‌స్పెక్టర్ : అర్గ్యుమెంటొద్దు. అడుగున ఏం రాసుందో చదువు! 'అమ్మాయి ఇంట్లోంచి వెళ్ళి పోయినవాడు నీలం చీరా, ఆకుపచ్చరంగు బ్లవుజూ వేసుకుంది. రంగు చామనచాయ. చెవులకు రింగు లున్నాయి. బహుశా విజయవాడలో ఉండచ్చు'— అని రాసుందా, లేదా? ఈ అమ్మాయి హోటల్లోకి వచ్చినప్పుడు సరిగ్గా నీలం చీరా, ఆకుపచ్చ రంగు బ్లవుజూ వేసుకుంది. హోటల్ మేనేజరు చూసి మాకు ఫోన్ చేశాడు. చెవులకు అవిగో రింగులు! రంగు కూడా చామనచాయ! ఇంక దబా యించి ప్రయోజనం లేదు. పదండి పోలీస్ స్టేషన్‌కి!
(సుందరి ఏడుపు ప్రారంభించింది)
శంకరం : (సుందరి బుజ్జగిస్తూ) సుందరీ ఏడు స్తున్నావా? ఛ. ఛ. వూరుకో. (ఇన్‌స్పెక్టర్ దగ్గరకెళ్ళి చేతులు పట్టుకుని) ఇన్‌స్పెక్టర్‌గారూ! నా మాట నమ్మండి. మేం నిజంగా మొగుడు, పెళ్ళాం! ఏ దేవుడిమీద ఒట్టేసి చెప్పమంటే ఆ దేవుడిమీద ఒట్టేసి చెప్తాను. మా ఆవిడ అసలే అమాయకురాలు. పోలీసులన్నా, గొంగళి పురుగులన్నా దానికి ఒళ్ళుమాలిన భయం. చూశారా అప్పుడే ఏడుపు మొదలెట్టేసింది. దయుంచి మమ్మల్ని ఒదిలిపెట్టేయండి.
సుందరి : (ఏడుస్తూనే) ఒదిలిపెట్టేయండి, సార్!
ఇన్‌స్పెక్టర్ : (ఆలోచించి) ఉ! ఆల్‌రైట్. ఈ వూళ్ళో మీకు తెలిసిన వాళ్ళెవరయినా ఉన్నారా?
శంకరం : ఎందుకు, సార్?
ఇన్‌స్పెక్టర్ : వాళ్ళొచ్చి మీ రిద్దరూ భార్యాభర్తలని చెబితే ఒదిలేస్తాను. ఎవరన్నా ఉంటే చెప్పండి!
శంకరం : అయ్యో. దిక్కుమాలిన గోల. ఇక్కడెవ రున్నారండీ? ఉంటే అసలీ వూరు ఎందు కొస్తాం?
సుందరి : (ఏదో గుర్తుకొచ్చి) ఏమండీ!
శంకరం : (ఆమె దగ్గరకు వెళ్ళును)
సుందరి : మీ నాన్నగారి స్నేహితుడు ఒకాయన లబ్బీపేటలో ఉండాలిగా?
శంకరం : (ఆనందంగా) ఆఁ...అవునవును! (ఇన్‌స్పెక్టర్‌తో) లబ్బీపేటలో ఉన్నారు, సార్! లాయర్ లంబోదరంగారు.
ఇన్‌స్పెక్టర్: ఆయనకు ఫోనుందా?
శంకరం: ఉంది, సార్! ఉండండి! నా డైరీలో ఆయన ఫోన్ నంబరుండాలి. ( బాగ్ లోంచి డైరీ తీసి గబగబా చూసి ) ఇదిగో, సార్. డబల్ టు డబల్ త్రీ ఫోర్!
ఇన్‌స్పెక్టర్: ఒకే! నేను కిందకెళ్ళి, రిసెప్షన్‌లోంచి లంబోదరంగారికి ఫోన్ చేసి వెంటనే రమ్మంటాను. ఈ లోగా మీరు వెర్రి వేషాలేం వేయకండి! మర్యాద దక్కదు. మన పర్మిషన్‌తో గుర్తుందిగా?
సుందరి: ట్వెంటీ ఇయర్సండీ!
శంకరం: కళ్ళల్లోకి చూసి కథంతా చెప్పేయగలరండీ!
ఇన్‌స్పెక్టర్: దట్స్ గుడ్. ( శీఘ్రగా వెళ్ళిపోయాడు )
శంకరం: ( కోపంగా అటూ ఇటూ పచార్లు చేస్తూ) ఇరవై ఏళ్ళ సర్వీసట. కళ్ళల్లోకి చూసి కథంతా చెప్పేయగలడట.
సుందరి: ( మంచం మీద ఒక చివర దిగులుగా కూర్చుని ) లంబోధరంగారు ఈ వేళప్పుడు ఇంట్లో ఉంటారో, ఉండరో?
శంకరం: తప్పకుండా ఉంటారు. అగ్నిసాక్షిగా పెళ్ళి చేసుకున్న వాళ్ళం. ఆ దేవుడే మనల్ని కాపాడు తాడు. నువ్వేం దిగులుపడకు, బాలా!
సుందరి: రేపెప్పుడైనా లంబోదరంగారు మీ నాన్న గారికి ఈ గొడవంతా చెప్పేస్తే?
శంకరం: రేపటి సంగతి తరవాత ఆలోచిద్దాం. ముందు ఈ గండం గడిచి గట్టెక్కనియ్.
( చేతులు రెండూ వెనక పెట్టుకుని సీరియస్‌గా పచార్లు చేస్తున్నాడు )
డైరెక్టర్: ఎక్స్‌క్యూజ్‌మీ, సార్! (తలుపు తీసు కుని లోపలకు వచ్చి టోపీ తీసి, వంగి నమస్క రించాడు ) గుడీవినింగ్!
శంకరం: ఎవరు మీరూ?
డై: తిన్నగా నా కళ్ళల్లోకి చూడండి! మీకే తెలిసి పోతుంది. మీ కళ్ళకి నా కళ్ళల్లో ఒక మృణాల్ సేన్ కనిపిస్తాడు. కాపోతే ఒకబాపూ కనిపిస్తాడు. కమాన్! కమ్ టు ది క్లోజప్!
శంకరం: ( అర్థం చేసుకున్నాడు ) చూడండి, మృణాల్ సేన్‌గారూ! (చేయి ఎత్తి నమస్కారం చేస్తూ) ఇప్పుడు మా మూడ్ బాగా లేదు. మరోసారి కనిపించండి. తీరిగ్గా మాట్లాడు కుందాం!
డై: ఒ. కే! మళ్ళీ వస్తాను. మీ పిక్చర్ నేనే తీస్తాను. వంద రోజులాడిస్తాను. వస్తాను.
( టోపీ పెట్టుకుని వెళ్ళిపోయాడు )
సు.: ఎరక్కపోయి ఈ హోటల్లో రూమ్ తీసు కున్నాం. హనీమూన్ సరదా మా బాగా తీరింది లెండి!
ఇన్‌స్పెక్టర్: ( ప్రవేశిస్తూ) రండి, సార్!
లంబోదరం: ( వెనక వస్తూ పైకి చూస్తూ ) ఎక్కడ...శవం ఎక్కడ?
ఇన్‌స్పెక్టర్: శవం కాదండీ!
లంబోదరం: శవం కాదా? మరి ఎవర్నో గుర్తు పట్టాలని చెప్పారు ఫోన్లో?
ఇన్‌స్పెక్టర్: మీరు గుర్తు పట్టవలసింది మనుషుల్నే నండీ. అరుగో. అటు చూడండి.
లంబోదరం: ( చూసి ఉత్సాహంగా ) ఎవరది? ఒరి ఒరి ఒరి శంకరం. నువ్వటోయ్! అరె అరె! అమ్మాయికూడా వచ్చిందే!
ఇన్‌స్పెక్టర్: ( అర్థం చేసుకుని) అయితే వీరిద్దరూ భార్యా భర్తలే నన్నమాట!
లంబోదరం: అన్నమాటేమిటండీ—ఉన్న మాటే! ఇతను నా స్నేహితుడు రాఘవరావ్ కొడుకు— పేరు శంకర్రావు! ఆ పిల్ల ఇతగాడి భార్య అని బల్ల గుద్ది మరీ చెప్పగలను, దట్సాల్!
ఇన్‌స్పెక్టర్: అమలాపురంలో అమ్మా యెవరో తప్పి

## ఆహార వైద్యము

మన కొచ్చే రోగాలను నయం చేసుకోవ టానికి కావలసిన మందులన్నీ మనం తినే పండ్లు, కూరగాయల్లో సహజంగా ఉన్నాయి. ఆహార వైద్యము అనే తెలుగు పుస్తకంలో ప్రకృతి వైద్యులు కృషి చేసి ఏ రోగానికేమి తినాలో, తెల్పిన వివరాలు, అన్ని రోగాలకున్నవి. వెల రూ. 12. పోస్టు ఖర్చులదనం. దేశసేవ ప్రచురణలు, 5/3, ఆర్ టి. పంజాగుట్ట కాలని, హైదరాబాదు—4 కు వ్రాసి మీ ప్రతిని వి. పి. పోస్టు ద్వారా పొందండి.




## వ్యవహార దర్శిని

ఈ తెలుగు పుస్తకంలో, స్త్రీల ఆస్తి హక్కులు, వారి ప్రత్యేక హక్కుల చట్టాలు, పురుషుల వివిధ హక్కులు మీ కెన్నో విధాల ఉపయోగించే అనేక చట్టాల వివరాలు, దస్తా వేజులు, పత్రాలు, ఫిర్యాదులు, పిటీషనులు, వివిధ ఉత్తరాలు, వ్రాసే విధానాలు, నమూనాలు, ఎన్నో రకాలున్నాయి. వెల. రూ. 12. పోస్టు ఖర్చులదనం. దేశసేవ ప్రచురణలు, 5/3. ఆర్.టి. పంజాగుట్టకాలని, హైదరాబాదు—4కు వ్రాసి మీ ప్రతిని వి. పి. పోస్టు ద్వారా పొందండి.

పోతే వాళ్ళ నాన్న పోలీసు కంప్లయింట్ ఇచ్చాడు. పేపర్లో ఫోటోకూడా వేయించాడు. తప్పిపోయిన పిల్ల ఈ అమ్మాయేనని మాకు అనుమానం వచ్చింది!

లంబోదరం: ఇప్పుడు కాదని తెలిసిపోయిందిగా?

ఇన్స్పెక్టర్: కాదని మీరు చెబుతున్నారుగా! థాంక్యూ. (శంకరాన్ని సమీపించి అతని భుజం తట్టి) సారీ ఫర్ ది ఇన్‌కన్వీనియన్స్ మిస్టర్! వస్తాను. (వెళ్ళిపోయాడు)

లంబోదరం: అది సరే కానీ, శంకరం! బెజవాడ వచ్చి మా ఇంటికి రాకుండా ఇలా హోటల్లో మకాం వేస్తారా? ఇదేమన్నా మంచి పనేనా అని బల్ల గుద్ది మరీ ప్రశ్నిస్తున్నాను.

శంకరం: (ఇబ్బందిగా) అది కాదండీ....ఏదో సరదాగా అలా నాలుగు రోజులు...

లంబోదరం: (కలపంకించి) కేసర్థమైందిలే... ప్రేమయాత్రకు బయల్దేరారన్నమాట...

శంకరం: (సిగ్గుతో) అదేనండి. ఏదో సరదాగా నాలుగు రోజులు అలా అలా...

లంబోదరం: కేసర్థమైందన్నానుగా... ఉఁ! మా నాన్నకి చెప్పలేదుకదూ?

శంకరం: చెప్పేమనుకోండి...కానీ...

లంబోదరం: 'సరదాగా నాలుగు రోజులు అలా అలా అలా' అనిమాత్రం చెప్పలేదు.

(శంకరం తల ఒంచుకున్నాడు)

లంబోదరం: 'విశాఖపట్నంలో ఫ్రెండు పెళ్ళికి వెళ్ళొస్తాం' అని చెప్పారు.

(శంకరం తెల్లబోయాడు)

లంబోదరం: నాలుగురోజుల్లో తిరిగొస్తామని చెప్పారు. ఈ నాలుగు రోజులూ సరదాగా ఈ ఇసుకు హోటల్లో ప్రేమయాత్ర చేద్దామనుకున్నారు...ఈజిట్?

శంకరం: ఇదంతా...

లంబోదరం: నాకెలా తెలిసిందని ఆశ్చర్యపోతున్నావ్కదూ? అవును...తెలిసింది...మా నాన్న చెబితే తెలిసింది. దట్సాల్!

సుందరి: (తుళ్ళిపడి) మావయ్యగారు చెప్పారా?

శంకరం: (తెల్లబోతూ) మా నాన్నగారు మిమ్మల్నెప్పుడు కలిశారూ?

లంబోదరం: నిన్న రాత్రి హైదరాబాదు వెళ్ళాను... పొద్దున్న కోర్టులో పని చూసుకుని—మీ ఇంటికి వెళ్ళాను. మీ గురించి అడిగితే—మీ నాన్న చెప్పాడు. మీ ఇంట్లో భోజనంచేసి బయల్దేరేముందు 'ఎలాగా కారుందికదా' అని మీ నాన్నని కూడా నాతో బెజవాడ రమ్మన్నాను...వచ్చేశాడు. ఇప్పుడు మా ఇంట్లోనే ఉన్నాడు. ఆఁ! ఉండండి. ఇక్కడకు రమ్మని ఫోన్లో చెప్తాను!

శంకరం: (వారించబోతూ) అదికాదండీ...

లంబోదరం: (వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు)

సుందరి: (భయంగా) ఇప్పు డెలాగండీ?

శంకరం: అదే నాకు అర్థం కావటం లేదు.

(ఇద్దరూ అటూ ఇటూ గేస్తున్నారు. ఈలోగా డైరెక్టర్ వచ్చాడు)

డైరెక్టర్: ఏమిటి, సార్! సీరియస్‌గా ఆలోచిస్తున్నారు? ఏదైనా ప్రోబ్లమా? ఓ... కథకి క్లయిమాక్సు దొరకలేదు కాబోలు! డోంట్ వర్రీ, సార్! క్లయిమాక్స్ నా కొదిలేయండి! (శంకరంతోపాటు అటూ ఇటూ పచార్లు చేస్తూ) లాస్టియర్ ఇలాగే ఒక మలయాళం పిక్చర్‌కి నేను డైరెక్టు చేస్తున్నాను. క్లయిమాక్స్ గురించి పేచీ వచ్చింది. అసలు కదేమిటంటే— హీరో హీరోయిన్లు ఒక హోటల్లో బసచేశారు. ఆ హోటల్లో యాంటీ సోషల్ యాక్టివిటీస్ జరుగుతున్నాయనే అనుమానంమీద— ఆ రాత్రి పోలీసులు రైడింగ్ చేశారు. హీరో హీరోయిన్లని అనుమానించారు. అరెస్టు చేశారు. పోలీసు స్టేషనుకి తీసుకెళ్ళి లాకప్‌లో ఉంచారు.

(సుందరి కెవ్వుమని అరచి మంచంమీద పడిపోయింది)

డైరెక్టర్: సరిగ్గా లాకప్‌లో హీరోయిన్ కూడా ఇలాగే అరచి పడిపోయింది.

శంకరం: (గాభరాగా సుందర్ని సమీపించి) బాలా...బాలా..

డైరెక్టర్: అప్పుడు హీరో ఇలాగే ఆత్రంగా, ఆదుర్దాగా, భయంగా, బెంగగా—

శంకరం: షటప్! ముందు అవతలకు పోతావా, పోవా?

డైరెక్టర్: క్లయిమాక్స్ చెప్పేసి వెళ్ళిపోతాను, సార్! నా ప్రతిభ మీకు నచ్చితేనే నన్ను డైరెక్టర్‌గా పెట్టుకోండి... లేకపోతే వదిలెయ్యండి! నా మలయాళం పిక్చర్లు నాకెలాగా ఉన్నాయి.

శంకరం: (కోపంగా) మహాప్రభో! నేను ప్రొడ్యూసర్ని కాదయ్యా, బాబూ! ఎల్లయిసీలో క్లార్కుని; ఆ ప్రొడ్యూసర్ గాడెవడోగాని ఈ రూమ్ ఖాళీచేసి ఎప్పుడో వెళ్ళిపోయాడు.

డైరెక్టర్: అయ్యసీ... మరి చెప్పరేం? అనవసరంగా మలయాళం కథంతా చెప్పేశాను. పూర్ ప్రొడ్యూసర్ ... మంచి డైరెక్టర్ని పోగొట్టుకున్నాడు. (వెళ్ళిపోయాడు)

శంకరం: బాలా...బాలా...లే, బాలా! వా డెళ్ళిపోయాడు...లే! (మంచినీళ్ళు తాగించాడు. లంబోదరం, రాఘవరావ్ ప్రవేశించారు.)

రాఘవరావు: ఏమిట్రా? ఉన్నపళంగా రమ్మని ఫోన్ చేసినవాడివి— విషయం చెప్పవేమిటి?

లంబోదరం: నే చెప్పడం ఎందుకూ? నువ్వే చూడు! కేసర్థమైపోతుంది. (చూపించాడు)

రాఘవరావు: (చూసి) అరె! మీరు...మీ రిక్కడ కెలావచ్చారూ? విశాఖపట్నం వెడతానన్నారు...... వెళ్ళలేదా?

శంకరం: (నీళ్ళు నములుతూ) అదే, నాన్నగారూ! విశాఖపట్నం...విశాఖపట్నం పెళ్ళికి...

రాఘవరావు: ఏమిట్రా? అలా నీళ్ళు నములుతా వేమిటి?

లంబోదరం: వాళ్ళ తరపున వకాల్తా నేను పుచ్చుకున్నానోయ్! జరిగిందేమిటో ఇప్పుడు... నే చెప్తాను!

రాఘవరావు: ఏం చెప్తావ్? అసలేం జరిగింది?

లంబోదరం: 'హనీమూన్‌కి వెళ్ళొస్తాం' అంటే నువ్ కాదు పొమ్మంటావని—విశాఖపట్నం పెళ్ళి' వంకపెట్టి బెజవాడలో బ్రేక్ జర్నీ వేశారు. నీ పెద్దరికానికి భయపడి ఇలాంటి ఇసుకు గదుల్లో ప్రేమయాత్రలు చేస్తున్నారు!

రాఘవరావు: ప్రేమ యాత్రా?

లంబోదరం: చూడు, రాఘవా! కొత్త దంపతులకి కొన్ని సరదాలూ, కోరికలూ ఉంటాయి. పెళ్ళికాగానే వాళ్ళకి మనం కొంతకాలంపాటు ఫ్రీడం ఇచ్చెయ్యాలి! హాయిగా చిలకా గోరింకల్లా వాళ్ళు ప్రేమయాత్రలు చేయాలి. అలాంటి అవకాశాన్ని మనమే వాళ్ళకి కల్పించాలి. ఒకరి నొకరు అర్థం చేసుకుని వాళ్ళ భావి జీవితాన్ని స్వర్గధామం చేసుకోటానికి ప్రేమయాత్రలు వాళ్ళ కెంతో దోహదం చేస్తాయి. కానీ, ఆ అవకాశం వాళ్ళకి ఇవ్వకుండా ఆంక్షలు వేశామంటే—మనమీద వాళ్ళకి గౌరవం పోతుంది. అంతేకాదు...వాళ్ళ సరదాలు తీర్చుకునేటందుకు అవసరమైతే మనతో అబద్ధాలు చెప్పటానికి కూడా ప్రిపేరయి పోతారని బల్ల గుద్ది మరీ చెప్పగలను.

రాఘవరావు: (విస్మయంగా) అంటే....వీళ్ళు విశాఖపట్నం పెళ్ళికి వెళ్ళటం—

లంబోదరం: కేవలం అబద్ధం! ప్రేమయాత్ర చేసొస్తామంటే నువ్వు ఏమన్నా అంటావేమోననే భయంతోటీ, సిగ్గుతోటీ నీతో అలా చెప్పి—ఇలా వచ్చేశారు...దట్సాల్!

రాఘవరావు: (సాలోచనగా) అవున్రా, లంబూ! చిన్నప్పుడు నాపెళ్ళయిన కొత్తలో మా ఆవిడా, నేనూ కూడా ఇలాగే ప్రేమయాత్రలు చేయాలని ఎంతో ఉవ్విళ్ళూరేవాళ్ళం... కానీ, నీకు తెలుసుగా—మాది జాయింట్ ఫామిలీ! ఎన్నో సమస్యలు... మరెన్నో ఇబ్బందులు! చివరికి ఆ కోరిక అలాగే అణగారిపోయింది. మళ్ళీ ఇప్పుడు మావాడూ, కోడలుపిల్లా కలసి చేసిన ఈ ఘనకార్యం చూస్తుంటే ఆ కోరిక తల ఎత్తుతోంది! రేపు హైదరాబాదు వెళ్ళగానే నేనూ, మా ఆవిడ బయల్దేరతాం!

లంబోదరం: (ఆశ్చర్యంగా) ఏమిటి...ప్రేమ యాత్రకే?

రాఘవరావు: (నవ్వుతూ) చాల్లేరా! ఈ వయసులో ప్రేమయాత్ర లేమిటి నీ మొహం? మేం వెళ్ళేది తీర్థయాత్రలకి! రెండ్నెల్లపాటు యాత్రలు చేసొస్తాం! ఈ రెండ్నెల్లూ మా అబ్బాయీ, కోడలు పిల్లా హాయిగా ఇంట్లోనే ప్రేమయాత్రలు చేసేసుకోవచ్చు.

లంబోదరం: (నవ్వుతూ) అవును...ఎంచక్కా వంటింట్లోంచి వసారాలోకి, వసారాలోంచి వంటింట్లోకీ...

(అందరూ నవ్వుతూండగా తెర) ★